# ఘటన!

నారాయణచార్యులు పరమనిష్ఠాగరిష్ఠుడు! కోడికూయక ముందే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని పెరట్లో నుయ్యి దగ్గర పిలకముడి విప్పి యజ్ఞోపవీతాన్ని తావళంగా వేసుకుని తలారా స్నానం ముగించి ముఖాన తిరునామం దిద్దుకుని తుంగచాప మీద కూర్చుని సంధ్యావందనం ముగించి.... పట్టుధోవతి బిళ్లగోచి పెట్టి పూలసెజ్జతో కిలోమీటరు దూరమున్న శ్రీ భావన్నారాయణస్వామి వారి ఆలయానికి బయల్దేరటం ఆయన దైనందిక చర్య! ఆయన ఆ గుడిలో ప్రధానపూజారి!

ఆలయ ప్రాంగణంలో గల వివిధములైన పూలు శిష్యులు సేకరించిన వాటిని పూలసెజ్జలో వేసుకుని గర్భగుడి తలుపులు తానే స్వయంగా తెరిచి స్వామి వారికి నిర్వహించాల్సిన కార్యం ముగించి శోభాయమానంగా దేవుడి విగ్రహాన్ని అలంకరించాకగాని వచ్చే భక్త జనం దర్శనం చేసుకునే వీలుండదు.

శ్రీ భావన్నారాయణస్వామి వారి ఆలయం బహుపురాతనమైనది. నాలుగైదు వందల సంవత్సరాలనాడు ఆనాటి మహారాజులు నిర్మించినది. ఆనాటి నుంచి నారాయణచార్యుల వంశీకులే అర్చకత్వం తరతరాలుగ నిర్వహిస్తూ రావటంతో పిన్న వయసు నుండే ఆయన ఆలయానికి స్వామి సేవకు అంకితమైనాడు.

ఆవూరిలో నారాయణాచార్యులను ఎరుగనివారు లేరు! దైవదర్శనానికి వచ్చే వూరి వారినందరినీ పేరు పేరున పలకరించి అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు ఇస్తూండటం మూలాన వూరి జనానికి ఆయన ఎడల భక్తిప్రపత్తులున్నాయ్!

స్వామివారి 'హుండీ'కి సమర్పించే కానుకలు కాకుండా స్వయంగ నీరాజనం అందించే పళ్లెంలో పెద్ద మొత్తాలు ముట్ట చెప్తూ భక్తులు పూజారిపట్ల తమకున్న ఆప్యాయతను బంధాన్ని చాటుకంటూ వుంటారు. తాతలతండ్రుల కాలం నుండి సంక్రమించిన ఆస్తి సొంత ఇల్లు, పాడిగోవు స్వగ్రామంలో కొంత భూమి వగైరాలున్నా ఇది నారాయణాచార్యులకు అధిక ఆదాయం!

ఎందరో భక్తులు ఆయన పాదాలకు నమస్కరించి ఆశీస్సులు పొంది తాంబూలంతోపాటు ఘనంగా డబ్బులు ముట్ట చెప్తూంటారు.

ప్రతినెలా వచ్చే హారతిపళ్లెం ఆదాయం పైపెచ్చు ఆశీర్వచనాల రాబడి

కలిసి ఆయన కుటుంబ జీవనానికి సమృద్ధిగా సరిపోతుందనే చెప్పాలి.

ఏడాదికోమారు భావన్నారాయణస్వామివారికి కడువైభవంగా కళ్యాణోత్సవం... తరువాత రథోత్సవానికి వూళ్లో జనం తరలివస్తారు. ఆలయం భక్తజన సందోహంతో కిటకిటలాడుతూంటుంది.

రథోత్సవం రోజున అలంకరించిన రథవాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆశీనులను చేసి ఇరువైపులాగల రెండు మోకులతో రథాన్ని లాగి వూరేగించేటందుకై భక్తులు ఉబలాటపడతారు. రథయాత్ర వూరు నాలుగు పక్కలకు పయనమౌతుంది. అడుగడుగునా టెంకాయలు రథచక్రాలకు కొడుతూ హారతులిస్తూంటే ఆ దృశ్యం చూడటానికి రెండు కళ్లూ చాలవన్పిస్తుంది.

రథోత్సవం నాడు పోటెత్తే భక్తజనాన్ని కంట్రోల్ చేయటం పోలీసుల తరం కాదు. ఆ రోజు ఎలాంటి అవరోధాలు లేకుండా అంతా సవ్యంగ సాగుతుంది.

అరవయ్యేళ్లుగా పూజారిగా నిర్వహించే అర్చకత్వపు బాధ్యతల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లనీయకుండా అత్యంత భక్తిశ్రద్ధలతో సేవలందించటం నారాయణాచార్యులవారి సమర్థత!

మనిషి ఆరోగ్యవంతుడు! ఏనాడు చిర్రున చీది ఎరుగడు. ఒకమాత్రైనా మింగాల్సిన అవసరం రాలేదు.

ఒక్కగానొక్క కుమార్తె! లేక లేక కలిగిన సంతానం కావటాన ముద్దుగ... గారాబంగా పెంచారు దంపతులు! శ్రీ భావన్నారాయణస్వామి వారి ఆశీస్సుల పుణ్యఫలమే తనకు ఆడపిల్ల కలిగిందని మురిసిపోని రోజు లేదు. ఒక్కమగబిడ్డ అయినా పుట్టి వుంటే బాగుండేదని నారాయణాచార్యులు ఎన్నడూ బాధపడలేదు. తలకొరివిపెట్టేవాడు లేకపోయనేని చింత ఆయన్లో లేనే లేదు. మగ, ఆడ బేధభావంలేని దంపతులు కావటంతో లక్ష్మిని మగపిల్లవాడైనా, ఆడపిల్ల అయినా అమే అనుకుని పెంచుతూ వచ్చారు.

వైష్ణవ సాంప్రదాయాలకు అనుగుణంగానే లక్ష్మి పెరుగుతోంది! బుడిబుడి నడకలతో పిల్ల ఇల్లంతా తిరిగి సందడి చేస్తుంటే తెగమురిసేవారు.

కాస్తంత నడక వచ్చాక తనతో పాటు కూతురుని కూడా ఆలయానికి వెంట పట్టుకెళ్లేవాడు. భార్య వద్దన్నా వినేవాడు కాదు, పిల్లకు దిష్టి తగుల్తుందంటే...! వచ్చే

పోయే భక్తుల అందరికళ్లూ లక్ష్మి మీదే వుంటాయ్!

గుడిలో కొచ్చే ప్రతివారూ లక్ష్మిని ముద్దాడటం... బుగ్గగిల్లటం.... ఆడపిల్లలైతే ఎత్తుకుని గుడి అంతా తిప్పి ఆడించటం! ఆకలనిగాని... తల్లి కావాలనిగాని ఏడ్చేది కాదు. అప్పుడప్పుడు లక్ష్మి భోజనం కోసం మారాంచేయకుండా వుండాలని తన శిష్యుల్లో ఒకరిని తోడిచ్చి ఇంటివద్ద దింపి రమ్మనటం అలవాటు!

ఎరుపు ఛాయ... పెద్దకళ్లు... మంచిముక్కు... వత్తైన జుట్టు... బొద్దుగ అందంగ ఆకర్షణీయంగ వుంటుంది లక్ష్మి. నారాయణాచార్యులు శాంతస్వభావి! నోరువిప్పి ఇంట్లో గాని బైటగాని పెద్దగానైనా మాట్లాడి ఎరుగడు.

కొడుకైనా, కూతురైనా ఒక్కతే పిల్ల కనుక పెద్ద చదువులు చదివించాలని అభిలాష నారాయణచార్యులది. అక్షరభ్యాసం గావించి నాటి నుండి విద్యపట్ల కూతురికిగల శ్రద్ధాసక్తులు చూస్తూ దంపతులిద్దరూ విస్మయం చెందుతుంటారు.

మారే కాలంతోపాటు సంతానాన్ని పెంచాలనేది ఆచారిగారి అభిప్రాయం! కుమార్తె పుష్పవతి కాకముందే వివాహం చేస్తే కన్యాధానఫలం దక్కించుకోవచ్చనేది తల్లి ఆలోచన! ఈరోజుల్లో బాల్యవివాహం నిషిద్ధమే పిచ్చిదానా!... ఆపని చేస్తే నిన్నూ, నన్నూ ఈడ్చుకెళ్లి జైల్లో పడేసి చిప్పకూడు తినిపిస్తారు. నువ్వనవసరంగా తెలిసీ తెలియకుండా మాట్లాడకు!... హితవు పలికేడు.

'నాదేం పోయింది. ఇలా చేస్తే అనాచారమౌతుందికదానేది నా భయం...' అంది భార్య.

'చూడూ! మనకు డబ్బు ఇబ్బంది లేదు కదా?... అమ్మాయి తెలివితేటలు చూస్తుంటే ముచ్చటేస్తోంది. అంచేత పెద్ద చదువేదైనా, చెప్పిద్దాం!...'

'ఏమోనండి ఆడపిల్లను పెద్ద చదువులకు దూరం పంపాలంటేనే భయం! రోజూ... ప్రేమ పేరుతో ఆకతాయి వెధవలు వెంటపడటం... ఏడిపించటం... ఆడపిల్లలపై దాడులు చేయటం.. టీ.వీ.లో వార్తలు వింటూంటే గుండెలో దడపుడుతోంది....'

'అయినదానికి కాని దానికి నువ్వనవసరంగ ఆందోళన చెంది ఆరోగ్యం పాడు చేసుకోకు... నాకు ఆకలిగా వుంది విస్తట్లో వడ్డించు.. నూతి దగ్గర కాళ్లు కడుక్కుని వచ్చేస్తాను...' కూర్చున్న నారాయణచార్యులు దొడ్లోకి దారి తీశాడు.

× × × × ×

రోజులు గిర్రున తిరిగొచ్చినయ్!

లక్ష్మి టెన్త్‌లోకి గెంతుకొచ్చింది! లంగా జాకెట్‌తోడు వంటికి మూడోది 'వోణి' వచ్చేసింది! టెన్త్‌లో స్కూల్ ఫస్టు రావటంతో నారాయణ ఆచార్యులగారిని వూరంతా అభినందించింది. ఇన్నేళ్లుగా మంచి మార్కులతో స్కూలు ఫస్టొచ్చిన స్టూడెంటే లేకపోవటంతో లక్ష్మికి బ్రహ్మరథం పట్టారు. లక్ష్మిని పై చదువుకు పంపమని కేవలం సలహా మాత్రమే కాకుండా ప్రోత్సహించారంతా!

'ఈరోజుల్లో ఆడపిల్లలు అన్నింటా ముందున్నారే పిచ్చిదానా!? వాళ్లు చదవని చదవులేదు... చెయ్యని వుద్యోగం లేదు...' ఫక్కున నవ్వాడు.

మనసులో మాట బైటికి చెప్పేటందుకు లక్ష్మి జంకినా 'నాన్నగారూ!... నాకు మెడిసన్ చదవాలని వుంది....' గొణిగినట్లే మాట్లాడింది.

'అంటే ఏమిటండి?-'

'దానికి డాక్టర్ కావాలని వుందిటే...'

'అమ్మో!... అంత పెద్ద చదువా?-' నోరు భార్గగ తెరిచింది.

'ఇంటర్లో ముందు చేరనీ... మిగతా భవిష్యత్ నిర్ణయాలు అప్పుడు తీసుకోవచ్చు....' తండ్రి మాట ఉత్సాహాన్నిచ్చింది లక్ష్మికి!

ఫీజుకట్టి లక్ష్మి ఇంటర్లో చేరింది!

'ఏమండీ.... డాక్టర్ చదువు మనూళ్లో వుందా?'

'లేదే అమ్మాయిని పరాయి వూరు పంపక తప్పదు...'

'ఎన్నేళ్ల చదువండీ అది?-'

'అయిదేళ్లు!-'

'అమ్మో! అయిదేళ్లు అమ్మాయిని విడిచిపెట్టి మనం వుండగలమా ?- పిల్ల ఒక్కగంట కళ్లు కనిపించకుండా వుంటేనే ఏదోగా వుంటున్న మనకు... అన్నాళ్లు దాన్ని విడిచి వుండగలమాని...?'

'సెలవుల్లో అప్పుడప్పుడొచ్చి మనలను చూచి పోతూ వుంటుంది లేవే... నువ్వనవసరంగ ఆందోళన చెందకు!

'మరైతే అమ్మాయిని ఎక్కడుంచటం? మన పిల్ల చదివే వూళ్లో మనకు

బంధువులెవరైనా వున్నారో లేదో?-'

'ఎవ్వరూ లేకుంటే లేడీస్ హాస్టల్లో వుంచుదాం!. డబ్బుకు మనకేమీ ఇబ్బంది లేదుగా ఆ భావన్నారాయణుడి దయవల్ల...! మనకు రోగమొస్తే డాక్టర్ వద్దకు పరుగెత్తాల్సిన అవసరం రాదే అమ్మాయి డాక్టరైతే! వైద్యం... మందులు అన్నీ ఉచితమే...' గలగలా నవ్వాడు నారాయణాచార్యులు.

మెడిసన్ పూర్తయింది. తను పి.జి ఫారిన్‌లో చేయాలనే కోర్కె లక్ష్మి తండ్రి చెవిలో వేసింది! కూతురు మాటకు ఎదురు చెప్పలేదు.

'చదివినంత వరకు చాలక విదేశాలు కూడా పంపటం దేనికండీ! ఊళ్లోనే ప్రాక్టీసు పెడితే ఎంత బాగుంటుందీ?-' దీర్ఘాలు తీసింది తల్లి.

'చూడవూ! అమ్మాయికి ఎం.ఎస్ చేసి మంచి సర్జన్ కావాలని వుబలాటపడుతున్నది కదా? మనమెందుకు వద్దనటం? - చదువురాని చవటాయిలెందరో వున్న ఈ రోజుల్లో మనకున్న ఒక్కగానొక్క పిల్ల చదువుల సరస్వతన్పించుకుంటుంటే మనం అడ్డు చెప్పటం... వుజ్వలమైన పిల్లదాని భవిష్యత్ నిరోధించటం కన్నవారిగా మనకు తగునా?... నువ్వేం అధిక ప్రసంగం చేయకు! అమెరికా వెళ్లి అమ్మాయిని చదువుకురానిద్దాం!...

'బాగుంది వరస!... చదువైన తర్వాత అక్కడే మంచి వుద్యోగం వచ్చిందంటుంది. అటు తర్వాత నచ్చిన వాడిని పెళ్లి చేసుకున్నానంటుంది!... అప్పుడు పిల్లది మనకు శాశ్వతంగా దూరమౌతుందనేదే నా బాధ..'

'అమ్మాయి మన చెప్పుచేతల్లో పెరిగిన పిల్లే!... అలా ఎన్నటికీ చేయదు!... అమ్మాయికెలాంటి వరుడు కావాలో దేశమంతా గాలించి అయినా సరే వెతికి తెచ్చి కాళ్లు కడిగి మనింటి అల్లుడిగా చేసుకుందాం! సరేనా?-

'ఇటు ఏడు తరాలు అటు ఏడు తరాలు వెతికినా అటు మగగాని... ఇటు ఆడగాని దేశం వీడి విదేశాలు వెళ్లిన దాఖల్లేవు కదండీ! ఇప్పుడు మనం ఆపని చేస్తే అయినవారంతా గడ్డిపెట్టరూ...?-'

'ఆపు నీ చాదస్తపు మాటలు! మారుతున్న కాలంతో మన పిల్లలూ మారాలి! తప్పదు! వారి ఆలోచనకు భవిష్యత్‌ను శాశించి అడ్డుకోకూడదు మనం!. మనం చేయవలసిందల్లా మంచిపనికి ప్రోత్సహించటమే!- నేను చేస్తున్నదీ అదే!-

బోధపడిందా?-'

ఒక్కగానొక్క కూతురు తమను విడిచి విదేశం వెడుతుందన్న ఆవేదన... ఎలా అక్కడ వుండగలుగుతుందో అనే ఆందోళనకు మనసు గురౌతున్నా... పైకి మాత్రం భర్త మాటకు తలవూపక తప్పటం లేదు జగదాంబ.

'విమానం ఎక్కి ప్రయాణించటానికి పూర్వజన్మ సుకృతం వుండాలే! వెళ్లాలనుకున్న వారందరికీ అవకాశాలు రావు. డబ్బు వుండీ విదేశాలకు వెళ్లలేని వారెందరో వున్నారు. లోకం పోకడ భార్యకు వివరించాడు.

'అంతేలెండి! శ్రీ భావన్నారాయణుడి దయ మనకు... ఆశీస్సులు అమ్మాయికీ వున్నంత కాలం మనకు అంతా మంచే జరుగుతుందనుకుందాం!... నాకు దొడ్లో బోలెడంతపనుంది... నేవెళ్లాలి....' జగదాంబ మెల్లగ అక్కడ్నించి జారుకుంది.

'నాన్నగారూ మీకోసం మొబైల్ తెచ్చాను. మీ వద్ద వుంచుకోండి!. నేను అమెరికా నుండి మీతో తరచు మాట్లాడాలి కదా... ఇది చాలా వుపయోగపడుతుంది....' అన్చెప్పి దాన్ని ఎలా వాడుకోవాలో తండ్రికి వివరించింది.

'ఇంకేం? ఇదొకటుందిగా... ఇక భయం లేదు. వీలున్నప్పుడల్లా మనం మాట్లాడుకుంటూ వుండచ్చు!... ఏమేవ్!... అమ్మాయి 'సెల్‌ఫోన్' కొని మనకు ప్రజెంట్ చేసింది చూడు....' తనే దొడ్లోకి పరుగులాంటి నడకతో వెళ్లి శ్రీమతికి చూపించటంతో ఇద్దరూ మురిసారు.

× × × × ×

రోజులు సజావుగా సాగిపోతున్నాయ్. వయస్సు మీదపడినా, మీదపడకున్నా ఆరోగ్యంగ మనిషి దృఢంగా వున్నాడు నారాయణాచార్యులు. ఆయన్ను చూచిన వారెవరరూ ఆయన వయస్సు పైపడిన మనిషిలా అవుపించడు.

దేవాలయానికి బయల్దేరబోతూండగ 'సెల్' రింగవటంతో ఆన్ చేశాడు. 'నువ్వా లక్ష్మీ... కులసాగా వున్నావా? నీ చదువు ఎలా సాగుతోంది?' అంటూ కూతుర్ని మాట్లాడనీయకుండా ప్రశ్నలవర్షం కురిపించసాగేడు.

కాస్సేపు ముచ్చటించుకున్న తర్వాత 'ఏమేవ్... జగదాంబా... ఎక్కడే నువ్వు?.. ఇలారా!.... త్వరగా...' కేకలు పెట్టాడు నారాయణచార్యులు.

దొడ్లో నూతి వద్ద బట్టలకు సబ్బు పెడుతూన్న 'ఆ! వస్తున్నానండీ... ఏమిటా

కంగారు?... ఏం కొంప మునిగిందని?...' చేతులు చీరకొంగుకు తుడుచుకుంటూ వచ్చి ఎదురుగా నిలబడింది.

'అమ్మాయి అమెరికా నుంచి మాట్లాడుతోంది... ఇదిగో 'సెల్' తీసుకుని విను... తర్వాత నువ్వు చెప్పాలనుకున్నదేమిటో వివరంగ చెప్పు...'

'అలాగా... ఏది... దాన్నిటివ్వండి' భర్త చేతులోంచి 'సెల్' లాగేసుకుని చెవి వద్ద పెట్టుకుంది జగదాంబ.

'నువ్వెప్పుడొస్తున్నావే? - ఒక నెల ఆగా? సరే సరే... చదువు బాగా సాగుతోందిగా.. వేళకు తింటున్నావా? నిద్రపోతున్నావా?... ఆ... ఆ... ఇక పెట్టేస్తున్నాను... సర్లే ఓ వారం ఆగి మళ్లీ మాట్లాడతావా? సరే సరే...' సెల్ ఆఫ్ చేసి భర్తకు తిరిగిచ్చేసింది.

కూతురు త్వరలో రాబోతోందన్న సంబరంలో భార్యాభర్తలిరువురూ చిందులేస్తూ చిన్న పిల్లల్లా ఇల్లంతా తిరిగారు.

వీధిలోకి వెడుతూ 'చూడూ! నేను మధ్యాహ్నం భోజనానికి రావటం లేదు...' చెప్పాడు.

'ఎందుకని?'

'మన గుడి గాలిగోపురం పరిశీలించటానికని పురావస్తుశాఖ అధికారబృందం వేంచేస్తోంది. వారికి స్వాగతం పలకాలి! - వారితో వుంటూ వారడిగే ప్రశ్నలకు వివరంగ నేను జవాబు చెప్పాల్సి వుంటుంది. ఊళ్లో మరి కొంతమంది ప్రముఖులను కూడా వారు పిలుస్తారేమో! తెలియదు... మరి నే వస్తా.. గుడి పనులు ఈరోజుకి శిష్యులకు అప్పగించి ఆ వచ్చేవారి వెంటనేనుండాలి.....' అనేసి రోడ్డెక్కాడు.

అప్పటికే రెండు జీపులు అధికార బృందం... లోకల్ పెద్ద మనుష్యులు గుడి ముందు గుమికూడి వుండటం దూరం నుంచి నారాయణాచార్యులు చూసి నడకవేగం పెంచాడు.

దగ్గరవుతూనే అక్కడున్న వారందరికీ రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు!

'రండి ఆచారిగారూ!... మీ కోసమే మా నిరీక్షణ...' ఓ అధికారి అన్నాడు. తమను తాము ఒక్కొక్కరిని పరిచయం చేసుకున్నారు పూజారిగారికి.

'రండి... దయచేయండి... లోపలికి వెడదాం...' పూజారి

నారాయణాచార్యులు అన్నాడు.

'ఈ ఆలయ నిర్మాణం ఎప్పుడో కొన్ని వందల ఏళ్లనాడు జరిగింది. ఆనాటి మహారాజులు దీన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో కట్టించి వుంటారండి....'

'అవునూ... గాలిగోపురానికి పగుళ్లొచ్చినట్టు అగుపిస్తున్నాయ్ కదా?... వీటిని మీరెప్పుడు గమనించారు?'

'చాలా సంవత్సరాలైందండీ! అప్పటి నుంచి అప్పుడప్పుడు అధికారులు దయ చేస్తున్నారు... పరిశీలించి తిరిగి వెళ్లిపోతూనే వున్నారు. ఏ ఒక్కరూ శ్రద్ధ తీసుకుని రిపేర్లు చేపట్టకపోవటం విచారకంగా వున్నదండి...'

'మేమూ ఇన్స్పెక్షన్‌కే వచ్చింది. ఇప్పటి పరిస్థితి ప్రభుత్వానికి నివేదిస్తాం! ఆపైన దేవాదయశాఖ గాలిగోపురం రిపేర్లను చేపట్టటం జరుగుతుంది...' ఆ వచ్చిన అధికారుల్లో ఒకాయన వివరించాడు.

'ఇలా అధికారులు వస్తారు... చూస్తారు.... వెళ్లారు... అంతేగాని మాకు అధికారం వుండదు. ఒక్కోపని ఒక్కొక్క డిపార్ట్‌మెంట్ చేయాల్సి వుంటుంది. మీరు మమ్ముల్ని నిందించి ప్రయోజనం లేదు...' జవాబిచ్చాడొక అధికారి.

'గాలిగోపురం అన్నివైపులా నెరియలిచ్చింది సార్. అదిగో చూడండి... మరి దీని బాగోగుల మాటేమిటో మాకెవ్వరికీ అంతు చిక్కటం లేదు. తహసీల్దార్ గారితో ఎమ్మార్వో గారు కూడా వచ్చి గాలిగోపురం విషయంలో సమీక్షించి వెళ్లారు. ఫలితం శూన్యం....' లోకల్‌గ డబ్బున్న రెడ్డిగారు స్వరం పెంచి అధికారులతో అన్నాడు.

అంతా గుళ్లోకి నడిచారు. వారందరికీ స్వామివారికీ ప్రత్యేక అర్చనలు జరిపించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టాడు నారాయణచార్యులు.

× × × × ×

లక్ష్మి అమెరికా నుండి వచ్చి పదిహేను రోజులు క్షణాల్లా గడిచిపోయినట్టు నారాయణాచారి దంపతులకు అన్పిస్తోంది! అమెరికా విశేషాలు కూతురు చెప్తూంటే నోరెళ్లబెట్టుకుని విన్నారు. కూతురుకి ఇష్టమైనవన్నీ చేసి పెడుతోంది జగదాంబ.

'అమ్మా! ఇక్కడున్న నెలరోజులా నువ్వు పెట్టినవన్నీ మింగుతూ వుంటే... డాక్టర్‌ను కాస్తా పేషెంట్‌నైపోతాను' జోక్ చేసింది లక్ష్మి.

ఆరోజు కార్తీక పున్నమి కావటాన తల్లీ కూతుళ్లిద్దరూ దేవాలయానికి బయల్దేరారు.

ఆలయం భక్తజన సందేహంతో కిటకిటలాడుతోంది. ఇసుక వేస్తే రాలని జనం!. పిల్లా, పెద్ద, ఆడ, మగ, ముసలి, ముతక అన్ని వయసుల వారూ వున్నారు దేవాలయ ప్రాంగణంలో క్యూకట్టి దైవదర్శనం కోసం!

ప్రధాన అర్చకులైన నారాయణచార్యులకు ఊపిరి సలపనంతపని! పర్వదినాన పగలంతా గుడి తలుపులు తెరిచి వుంచాలి కనుక భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంచుతూ తనూ దైవప్రసాదాన్నే కళ్ల కద్దుకు స్వీకరించి క్షుద్బాధ తీర్చుకున్నాడు. కరంట్ కొరత వల్ల గర్భగుడిలో ఒకటే ఉక్కపోత. వంటి చెమట పదేపదే తుడుచుకుంటూ కర్తవ్యాన్ని నిర్వహించటంలో నిమగ్నమైనాడు.

సాయంసంధ్యా సమయం సమీపించటంతో అలసిపోయిన నారాయణాచార్యులు కొద్ది సేపు స్వామి సేవ శిష్యులను నిర్వహించమని తాను, భార్య జగదాంబ, కుమార్తె లక్ష్మీతో ఇంటికి బయల్దేరాడు!

రద్దీ సగానికి సగం తగ్గినట్టు వుంది!

ముగ్గురూ గాలిగోపురం దాట ప్రయత్నించే సమయంలో పెద్ద శబ్దంతో ఆలయ గాలిగోపురం క్షణాల్లో కూలిపోవటంతో ప్రధాన పూజారి నారాయణ చార్యులు అతని భార్య జగదాంబ, ఏకైక కుమార్తె లక్ష్మి శిధిలాల క్రిందపడి అశువులు బాయటంతోపాటు మరి కొందరు భక్తులూ ప్రాణాలూ కోల్పోయారు.

తలవని తలంపుగా జరిగిన పరిణామానికి అక్కడున్న వారంతా భయభ్రాంతులై తలా వక దిక్కుకు ప్రాణభయంతో పరుగులు పెట్టారు.

కొందరు వెంటనే సహాయక చర్యలు చేపట్టి మృతుల కళేబరాలను రాళ్ల క్రింద నుంచి వెలికితీశారు.

గాలిగోపురానికి సకాలంలో రిపేర్లు చేయించక నిర్లక్ష్యం చేసినందువల్లే ఈ ఉపద్రవం జరిగిందని అక్కడివారంతా విలవిల్లాడి కన్నీరుమున్నీరుగా విలపించారు.

నిర్లక్ష్యానికి మూల్యం కొందరి అమాయకుల ప్రాణాలు...!! చివరకు దీన్ని దైవ ఘటనగా భావించారంతా!!!.

(సాహితీ స్రవంతి - మాసపత్రిక ఫిబ్రవరి 2012)